
బాబాయి కవితలు
...అమ్మ

# మా పాప అన్షు

# ఓణీవేడుక

## 9.7.2017



'యశస్వి' కవిత్వం

✤✤

భానుకిరణ్-సంధ్యశ్రీ

**అన్నుపాప ఓణీవేడుక**

**(బాబాయి కవితలు)**

**యశస్వి- తెల్లకాగితము, 2012,**

**వేలికొసన, 2016** నుండి

ఎంపిక చేసినవి.

ముద్రణము :

09-07-2017

**సర్వహక్కులు రచయితవి**

వెల : **అమూల్యము**

ప్రతులకు:

**యర్రంశెట్టి భానుకిరణ్**

**9004082235**

ముద్రణ:

**రెయిన్‌బో ప్రింట్ ప్యాక్**

7-1-548, హనుమాన్ దేవాలయం ప్రక్కన,

అమీర్‌పేట, హైదరాబాద్ - 500 016.

ఫోన్: 040-23731620/23741620

# మా ఇంట పుట్టిన వెన్నెలకి,,

పాపాయి గా ఎవరు పుడతారని
ఓ బాబాయికి సందేహం
అమ్మమ్మలు నానమ్మల కలల పంట
అమ్మ అవునో కాదో, ఆడుకునే బొమ్మ కాదు;

పుస్తకాలు తిరగేసినా
ప్రపంచాన్ని తిరిగేసినా
పురాణాల్ని నెమరేసినా
ప్రశ్న గానే మిగిలిపోయింది

అమ్మలగన్నమ్మ అబ్బాయిల్నే కన్నదంటారు
వడ్డీకాసులవాడి పిల్లల వూసే లేదు
రాముడ్ని కదిపినా భీముడ్ని కుదిపినా
ముక్కంటికి కూడా పూలు పూయనట్టే రాసారు

క్రీస్తు నడిగినా దోస్తునడిగినా
దేవుడూ మగవాడే అంటారే
దేవతల్లో రాక్షసుల్లో ఆడవాళ్ళ లెక్కల్లేవు
ఎక్కడని వెతకాలి! అమ్మాయిల మూలాలు!!

స్వర్గం నరకం ఉన్నాయో లేవో
అమ్మాయంటే నేలమీద విరిసిన జాబిల్లే కదా
ఈ నేలని సారవంతం చేసే నదుల లెక్కన
మానవత్వపు పరిమళాలు వెదజల్లే పువ్వులెక్కన

తలపుల్లో అనిపించింది..
మదిలోనైనా, మందిలోనున్నా
తెలియకుండా తడిపేసే వెన్నెలవాన
ఏ తనువు కైనా తనూజే కదా !!

అన్నూ!

ఆమెన్ ఇన్షాల్లా ల కలబోత నీ పేరు
సంధ్యాకాంతుల వడబోత నీ పుట్టిల్లు

చంద్రవంక మా వాకిలి లో కురిపించే
వెన్నెల వెల్లువ నీ నవ్వు
పంచిపెట్టుకునే మా పళ్ళతోటలో
విరిసిన మామిడి పువ్వు

అల్లరిపిల్లా!
నిన్ను చూస్తే అనిపించింది
ఏ దేవుడికీ లేని పదవి
ఆడపిల్లని కనడమే కదా అని

అన్న  వెన్నెల్ని కని
జీవితం పరీక్ష పాసయ్యాడు;
చంద్రుడ్ని కన్నా కదా!
నే పాసవుతానా!

(అన్న కూతురు అన్నుపాప ఓణీ వేడుక 9.7.2017 సందర్భంగా)



## ✣ భానుకిరణం ✣

వయసు ఎంతో చెబితే ఆ సమయంలో తప్పు అబద్ధమౌతుంది
పొడుగు ఎంతో చెబితే కాలం గడిచేకొద్దీ ఎత్తు ఎదుగుతుంది
పాప పేరు తనంత పొడవేమీ కాదు

తొలిసంధ్య ఎక్కుపెట్టిన భానుకిరణం మా పాప – అన్షు
రోజూ నిద్దుర బద్ధకాన్ని వదిలించే వెలుతురు తునక
సంధ్యా సమయాల్లో మా నట్టింట నాట్యం చేసే సంక్రాంతి పండుగ
నవ్వుల్ని పువ్వుల్లా చితుకబూసే మల్లెతీగ

పెద్దగా సంగీత జ్ఞానం లేని మాకు
మా పాపే ద్వారం వెంకటస్వామి నాయుడుగారి ఫిడేలు రాగం
పాలగుమ్మి విశ్వనాథం గారి అమ్మదొంగా లలితగీతానికి
వేదవతీ ప్రభాకర్ గారి మధుర ఆలాపన
కంటీ శుక్రవారము.. అన్నమయ్య కీర్తన వింటుంటే
గరిమెళ్ళ బాలకిష్ణ ప్రసాద్ గారే.. మాపాప

మాపాప లోనే సంగీతముందో సంగీతంలోనే మాపాప ఉందో
ఆ పొడుగు వేళ్ళనే కాదు కాళ్ళని చూసినా చెప్పొచ్చేమో!
లయబద్ధంగా వేసే అడుగులు ఎప్పుడూ తడబడకుండా
ఉండడం మా సంతోషం
కంటనీరు కనబడకుండా ఉంచడం మా ప్రయత్నం
మా ఆనందాన్ని ఇలా పంచుకోవడం మీ ఆశీర్వాదం కోసం

ఇప్పటికి అన్షు పేరు ఎవరెస్ట్ పైకి నాలుగు సార్లు ఎక్కింది
మా పాపని దీవిస్తే మమ్మల్ని మీరు ఎక్కించినట్టే

**– కుటుంబ సభ్యులు**

## ✤ విషయసూచిక ✤


| | |
|---|---|
| అన్న పుట్టిన రోజున .. | 1 |
| చిన్నా ! టైమయింది లే .. | 4 |
| చతుర్థ చంద్రోదయం | 7 |
| బిడ్డలాంటి అమ్మ గురించి | 9 |
| అమ్మచీర | 11 |
| నాన్నొచ్చేదారి | 14 |
| ఆ నోటిమాట | 16 |
| అ–అమ్మ, ఆ–ఆవు | 18 |
| నా అస్థిత్వం ఒక వస్తువేగా! | 22 |
| ఓ పంది గోల | 24 |
| బొమ్మరాళ్ళు | 27 |
| ఉప్పు 'ధనం' | 29 |
| బేరం- నేరం | 31 |
| **ON THE OTHER HAND** | 34 |
| అడగకు నన్ను!! | 38 |
| నాదేశం ఓ పూల చెట్టు | 41 |
| **# 2045 INITIATIVE** | 44 |
| అక్షరాన్ని నేనక్షరాన్ని | 47 |
| సాగిపో | 51 |
| ఆగి..... | 53 |
| చివరి పేజీ | 56 |



## ✤ అన్న పుట్టిన రోజున .. ✤

నాకోసం ఎదురుచూసిన మొదటి పసివాడు
'ఆడుకోడానికి తమ్ముణ్ని కొనుకొత్తానికి
అమ్మ నరసాపులం ఎల్లింద'నే తెలుసు

తనయ్యన్నీ
అమ్మతో సహా పంచేసిన మనసుతోనే
అన్నయ్యయ్యాడు నాకు

అన్నం తినే ప్రతిపట్టా
అమ్మచేతి మొదటిముద్దను
ఒక్కముద్దుతోనే త్యాగం చేసినోడు
చివరిముద్దా నాకై వదిలేసి
పెరుగన్నం మానేసాడు
నా మొదటి చెలికాడు

కూర్చోబెట్టి తిప్పాలనేమో
మూడుచక్రాల సైకిల్
కొనిపించుకున్నాడు

మూడేళ్ళవయసప్పుడు

అన్న నా మొదటి రిక్షావాడు
రెండేళ్ల ముందరే పుట్టినోడు
రెండే కేజీల బరువు తేడా బక్కోడు
అయినా సరే అన్ననిపించుకున్నాక
నాబరువు మొయ్యడం వాడి పెద్దరికం
తప్పు తమ్ముడిదైనా
వేలు కొరికించుకున్నందుకు
తిట్లు తినడం ఇష్టమైందో
తప్పనిసరైందో

ఇప్పుడు నేను చెప్పడం కష్టం

ఇంటి నుంచి తరగతిగది వరకూ
తోడొచ్చే బాడీగార్డ్
నే పీకిన పందిళ్ళ లెక్కలన్నీ
అమ్మకు అప్పజెప్పే బ్యాడ్ బోయ్

నా పిలక కోయబోయి మెడగాటుపెట్టి
అమ్మచూడకుండ ఇట్టే మానిపోవాలని
మిరపకాయ రుద్ది మాడగొట్టినోడు
మంటటే ఏమిటో చూపెట్టినోడు

ఓడినప్పుడు మళ్ళీ ఆడించినోడే
గెలుపురుచి చూపించినోడే
ఆటలో సైతం జట్టు మారనోడు
తోట జామచెట్టులాంటోడు

నేను పుట్టిన వారానికే అన్న పుట్టిన రోజేంటి!!
ఎప్పటికీ అర్థం కాదనుకున్నా
టెలివిజన్ ఆన్ చేసాక తెలిసిందోనాడు
కాంతికన్నా ముందే ధ్వని ఎందుకు వినపడుతుందో!

నే రాకపోతే వాడు అన్నెట్లా అవుతాడు !!
నను కనిపెట్టుకుని మోగే అలారం క్లాక్ కదా వాడు!!
చల్లగుండూ అందామనుకున్నా
చిన్నోడిని కదా! అట్లా అనొచ్చా!
మరి సూరీడు ఆడిపేరు

ఇంకా నే ఎదగలేదనిఅమ్మ పోసే కన్నీళ్ళకు
పత్రహరితం పంచాలని
ఏసీ కారులో ఊరంతా తిప్పుతూ చిరుబురలాడతాడు
నా సారథి వాడు

భవసాగరతీరాల పరిగెత్తించే
కాలానికి గాలంవేసి
నన్నుకూర్చోబెట్టిన కవిత్వాన్ని
వాడికీ వినిపిస్తాను

ఇంకో వంద జన్మలతోడుని భరోసాగా వదిలేసి
తన నవ్వుల కిరణాలతో
నా చీకటిని తరిమేస్తూ
నన్ను నా గమ్యానికే వదిలేస్తాడు
వేడిసెగ తగలనివ్వని నా వెన్నెల సూరీడు
దూరంనుంచే నన్ను కాపలా కాస్తాడు

8.9.2014

## ✤ చిన్నా! టైమయింది లే.. ✤

చిన్నా! టైమయింది లే. ✳ స్కూల్ బస్సు వచ్చేస్తుంది ✳
మొహం కడుక్కో. ✳
పళ్ళు తోముకో ✳ నా మాట వినరా కన్నా!! ✳
టైమైపోతుందీ ✳ పక్క అలాగే వదిలేసావు ✳
దా స్నానం చేద్దువ్ గానీ లేచావా!! ✳
తలదువ్వనీ ✳ బట్టలివిగో ✳ బూట్లేసుకున్నావా!! ✳
ఏరా అలా ఉన్నావే! ఒళ్ళెచ్చగా ఉందా ✳
హెూంవర్క్ బుక్కు పెట్టుకున్నావా!! ✳
చూసుకో అన్నీ ఉన్నాయో లేదో ✳
తిన్నగా నడు ✳
బాక్సు నువ్వే తింటున్నావా!! ✳
ఏదీ వదలొద్దు అర్థమైందా!! ✳
ఈవాళ గేమ్సున్నాయా!! షూస్ జాగ్రత్త ✳
అవి–ఇవీ కలపకు ✳ నెమ్మదిగా తినూ నమలాలి ✳
అలా అని లేట్ చేయకు బస్సొచ్చేసింది ✳
జాగ్రత్త దేవుడికి దణ్ణం పెట్టుకున్నావా!! ✳

✤✤✤

పుస్తకాలు అలా పడేసావే!! ✳
కాళ్ళు–చేతులూ కడుకున్నావా లేదా! ఆగూ ✳
ఈ పాలు తాగు తొందరగా ఎదిగిపోతావ్ బోల్డు బలమొచ్చేస్తుంది ✳
మూతి తుడుచుకో కొద్దిగా పౌడర్ రాస్తానుండు ✳
సరే బయటాడుకో గానీ ఎవరితోనూ దెబ్బలాడకు ✳
మంచిగా ఉండాలి

రోడ్డు మీదకు వెళ్ళకు కుక్కలుంటాయ్ బాబోయ్ ✳
ఆరింటికల్లా ఇంట్లో ఉండాలి!
లేకపోతే నేనే వస్తా నీ ఇష్టం మరి ✳

✣✣✣

ఎన్నింటికి రమ్మంటే ఎన్నింటికి వస్తున్నావ్!! ✳
నీ గది సర్దుకో ఇల్లు పాడు చేయకు ఈ పక్క పరు ✳
ఇప్పుడే చెయ్యాలి లేకపోతే టీచర్ నిన్నే తిడుతుంది. ✳
ఏరా అడివిలో పుట్టావా నువ్వేమైనా!! ✳
ఒక్క మాటైనా విన్నావా!! నీతో నేను మాట్లాడను ✳
ఫోనెత్తు, సరిగ్గా పెట్టు  టీవీకి అంత దగ్గరగా కూర్చోకు ✳
ఇలా తిరుగు అన్నం తిందూగాని  ఇలా తిరగమంటుంటే ✳
ఒలికిపోతుంది ✳
ఇదికొరుకు నమిలేటప్పుడు నోరు మూసుకోవాలి ✳
నాతో మాట్లాడకు ✳
నీ ప్లేట్లో పెట్టిందంతా తినెయ్యాలి  వదలకూడదు ✳

✣✣✣

ఆ గోడ మీద రాయకు ఓనర్ చూసారంటే తిడతారు ✳
నా మాట వినకపోతే సెల్ ఫోన్ కూడా ఇవ్వను ✳
తీసుకున్నాక థాంక్స్ చెప్పాలి ✳
నువ్వు ఎదిగాకా కానీ నే చెప్పింది నీకర్థం కాదు ✳
నీకు పిల్లలు పుట్టేదాకా ఆగు;
అప్పుడనుకుంటావ్ అమ్మ నిజం చెప్పిందని ✳
విసిగించకు గట్టిగా పట్టుకో ✳
నేను మూడు లెక్కపెట్టేలోగా రావాలి  లేదా
నీ పని నువ్ చూసుకో ✳
నాకెందుకు!! నిన్నసలు పట్టించుకోను ఇలా ఐతే ✳
నువ్ ఎంత పెద్దోడివైనా నా కొడుకువేరా ✳
నిజం చెప్పు అమ్మ మీద ఒట్టేసి ✳

మీ ఫ్రెండ్స్ అంతా మేడ మీంచి దూకేస్తే నువ్వూ దూకేస్తావా!! ✳
ఈ మాట నీకిప్పటికి వెయ్యి సార్లు చెప్పాను ✳
నువ్వు మీ నాన్న కొడుకువిరా అందుకే నా మాట వినవ్ ✳
నీతోనే మాట్లాడుతుంది ఇలా చూడు ✳
ఎక్కడతీసింది అక్కడ పెట్టు ✳
ఊరికే ఏడవకు పడుకో ✳
మీద కాలూ–చెయ్యీ వేసేస్తే ఎలా గాలాడదు నాకు. ✳
సరిగ్గా బొజ్జో!! .దణ్ణమెట్టుకున్నావా! ✳

✧ తీరా బిడ్డ నిద్ర పోయాక... ✧

అలసిపోయాడమ్మా
వీడు నా బంగారు కొండ
దిష్టి తియ్యాలి

6.7.13

# ✤ చతుర్థ చంద్రోదయం ✤

చిన్ననాడెప్పుడో చంద్రుడ్ని చేరువగా చూసిన
జ్ఞాపకం
బహుశా
అమ్మ చూపుడి వేలిచివర వేలాడుతూ అనుకుంటా.

అప్పట్లో ఎంత అందంగా ఉండేవాడు !
పంచదార కలిపిన పెరుగన్నం ముద్దలా
అదేంటో.. నే ఏడుపు ఆపేలోపు అమ్మ గోటిపై
చేరేవాడు
చల్లగ నా కడుపులోకి జారేవాడు

నే నిద్దరోయాక నాన్న వచ్చేవాడు
నింగికి నేలకు నడి మబ్బులా
గర్జించేవాడు, పన్నీటి మేఘమై వర్షించే వాడు
అమ్మ వెన్నెలంతా నాన్నకే సొంతం.
ఏ అమృత సాగర మథన ఫలితమో
కొని నెలలకి మా ఇంట శశి వదన ఉదయం

చిన్నప్పుడెప్పుడో చంద్రుణ్ణి ఏడుస్తూ చూసిన జ్ఞాపకం
బహుశా అమ్మ అద్దాల నడుమ ననుకుంటా
అచ్చంనాలానే ఉండేవాడు
నోట్లో పాలపీకతో నా చిన్ననాటి ఫోటోలోలా
అల్లరి నాలానే చేసేవాడు
పెద్దయ్యాక నాకు తోడొచ్చేవాడు



నాన్న చేతికి అందొచ్చేవాడు
జ్ఞాపకాల దొంతరలో నలగని నిజం
తమ్ముడైనా అన్న లాంటి వాడి నైజం

చంద్రుడు నను చూసి నవ్విన జ్ఞాపకం
ముస్తాబించి కూర్చోపెట్టాకే

అదేంటో.. నే తలెత్తి చూసేలోగా తెరమరుగయ్యాడు
తెలిమంచు కరిగేలోగా తలపులెన్నో రేపాడు
అప్పటి వరకు తెలియలేదు
ఉదయ చంద్రిక కూడా ఉంటుందని నులివెచ్చగా

ఎన్ని జన్మల బంధమో ఆ సప్తపద బంధం
చలువ రాయిపై అరిగే చందం నా జీవన గంధం .
ఆ చంద్రునితో నా అనుబంధం.

అష్టమి అమావాస్య తెలియకుండా
రసరాజ్య యుద్ధం
ఫలితం
పాడ్యమి పాపడు సిద్ధం
ఇదే కదా స్త్రీ జన్మ కోరే చంద్రోదయం

## ❖ బిడ్డలాంటి ఆమ్మ గురించి ❖

మా చిలకమ్మకు అరవై దాటి నాలుగేళ్ళు
వచ్చాయని
ఉదయాన్నే పలుకరించి
ఏం చేస్తున్నావే పిల్లా! అంటే
రోజూ లానే తోటకెళ్ళాను తండ్రీ!! అంది

మట్టిని తడిపి మొక్కను తడిమే
రైతుబిడ్డ మా చిలకమ్మ
ఆ చేతలకి జల ఎక్కువ,
అంతకన్నా పచ్చదనం మక్కువ

జంటపక్షిని శతపోరి
కట్టించుకున్న గూట్లో కుదురుగా కూర్చోక
తన వాకిలితోటలో మొక్కలకి పాలిస్తూ
పళ్ళూ–కాయలూ పండిస్తూ ఉంటుంది

ఆచేతిన పలుగు చిత్రంగా
మాయలఫకీరు మంత్రదండమైనట్టు
ఒక్కోమొక్కా వందల కాయలు కాస్తుంది
వేలపూలు పూస్తుంది

పెట్టాలన్న కోరిక
అమ్మకు నను కనకముందే పుట్టింది;
పంటను ఊరంతా పంచే పని
నాకే పెట్టేది

వృక్షాల్లా ఎదగమని
పిల్లల్ని మొక్కల్లాసాకింది

పొదుగులో ఒదిగినప్పుడే,
ధర్మాన్ని మాపాలుచేసి పట్టించింది

నేర్పిన పాఠాలు మర్చిపోనని మాటచెప్పాకే
అన్ననీ ఎగరనిచ్చింది
అమ్మని వదలలేక ఎదగడానికి వెనుకాడే ఈ బిడ్డని
పొడిచి మరీ ఎగరడం నేర్పింది

తనని అంటిపెట్టుకు ఉండమని
ఏనాడు అడగని తల్లి
కోరుకున్నది
పెంపకానికి మచ్చరాకుండా ఎదగమనే

నెర్రలుతీసే ఎండ నా పాల్పడకుండా
ఆలోచనల పాదులు చేసి
నారు పోసినట్టే నీరు పోస్తుంది

నా జీవిత చరిత్ర రాసుకుంటే
ఇక్కడ్నించే మొదలెట్టాలనుకుంటాను

ఆ అమ్మే పదేళ్ళ పాపగా అరవై ఏళ్ళ తండ్రికి
అన్నం వండి వడ్డించిన ఆ కథలో

ఆకులో బోర్లించిన కూరదాక సాక్షిగా
కడుపు నిండకమునుపే కళ్ళను నింపుకుని
చిన్న కూతురికి చేసిన బాస
“నీ చిన్నకొడుకునై పుడతానమ్మా!”

అందుకేనేమో ఆ దీవెన వరమయినట్టు
ఇంటికెళ్ళిన ప్రతిపట్టూ
నలభై వసంతాలు దాటిన బిడ్డలకి
ఇప్పటికీ మనసారా ముద్దల్ని తినిపిస్తుంది
అమ్మలాంటి బిడ్డగా, బిడ్డలాంటి అమ్మగా
నను నిత్యం తండ్రిని చేసుకుని మురుస్తుంది

18.5.2016



# ✤ అమ్మచీర ✤

ఏ వంటకో ఇంటిపనికో అమ్మ అంకితమైనప్పుడు
నన్ను ఉయ్యాలలూగించిన నిద్ర భరోసా
అమ్మచేతిని నాన్న వదలనప్పుడూ
మరోచేయితో కలిసి దూలానికి ఊగేది అమ్మచీర

నేలమీద పడకుండా కాపాడిన అమ్మచీరే
వెన్నుకు పరుపయ్యేది, తలకు దిండయ్యేది
పాలకక్కుల గుడ్డయ్యేది,
మొలకింద మెత్తని గోచీగా మారేది

నలుగు తానాల వేళ అమ్మచీరే
తడిచేది, మురిచేదీ, తుడిచేది, మడిచేదీ

శ్రమ చిందించిన చుక్క
ఆ ఒంటినుంచి ఈ చీరకంటి సౌరభమయ్యేది
ఆ మత్తులోనే నా శైశవం సుస్తుగా నిద్దరోయేది

తడబాటు అడుగుల రోజుల్లో
దారిపొడవునా మోకాళ్ళకు మెత్తగా మారినది
అమ్మచీరే

సైకిళ్ళాటల రోజుల్లో
కొట్టుకుపోయిన కాళ్ళ రక్తాన్ని పీల్చేసి
దూదిపింజగా, గాజుగుడ్డగా మారిపోయేది
అమ్మచీరే



నెత్తుర్నీ రసినీ గాయాలతో
ఎత్తుకుని హత్తుకునేది
నాకోసం ఏడ్చే  కన్నుల్ని ముక్కునీ తుడిచేదీ
అమ్మచీరే,

భయమేసినప్పుడల్లా నను దాచేదీ,
నాకు ఆకలేసినప్పుడల్లా ముడివిప్పేదీ
అవసరానికి డబ్బుముడిగా బొడ్డున దోపబడేదీ
అమ్మచీరే

నే రంగస్థలమెక్కి వీరంగమౌతున్నప్పుడు
నా ఒంటిని చేరి వందలమంది ముందర
నా అడుగులకు లయబద్ధంగా నాట్యం చేసేది

చెమరింతల్ని పీల్చుకుని నను చల్లబరిచేది
వెన్ను కింద ఆహార్యమై వడిసిపట్టింది

చదువులకై ఇంటిని వదిలెళ్ళిన రోజుల్లో
నా రహస్య వేదననూ, నిశీధిరోదననూ
తనలో ఇముడ్చుకునెందుకే

నా దిండు పైకి చేరుకుని
గుండె కింద పరచుకున్నదీ
అమ్మచీరే

అమ్మచీర నాతో పెనవేసుకున్నరాగ బంధం
అది అమ్మ మేనిసుగంధం

ఎప్పుడైనా అమ్మకు ఓ చీర కొందామనుకున్నా
అంగడి మొత్తం మీద అమ్మకానికి దొరకనిది అది
వెతికి పట్టుకోవడం
నా వల్లకాదని తేలిపోయింది
అమ్మ చీరకు ప్రత్యామ్నాయం లేకపోయింది



చీరలు వాడినవి కొన్ని కనిపిస్తునే ఉన్నాయి
అవి మాత్రం అలుపెరని అమ్మలా
ఏ వంటగదిలో మసిగుడ్డగానో
కిటికీకి తెరగానో తమ పనిని చేస్తునే ఉన్నాయి

ఏదోనాడు పరాకులోనైనా
ఓ చీరకొంగు కరుకుగా తగిలినా
అది అమ్మచీరనే జ్ఞప్తికి తెస్తుంది
నా కళ్ళతడిని రహస్యంగా తుడుచుకుని
ఆ కొంగు మెత్తగా మారిపోతుంది

నా తడిని పీల్చిన దేదైనా ఇట్టే
అమ్మచీరైపోతుంది
అక్షరాలైనా, అమ్మడైనా,
అమ్మకాని అమ్మాయి  ఈ జీవితాన లేదు

నచ్చిన నాబొమ్మతోనైనా అమ్మచీరనే పంచుకున్నాను
నేనెప్పటికీ అమ్మచీరతోనే ఉంటాను
ఎదుటి వనిత ఎవరైనా
అమ్మచీరనే కళ్ళకు కట్టుకుంటాను

15.3.2019



## ✤ నాన్నొచ్చేదారి ✤

“స్కూల్ ఆటో ఆగలేదు; కారేజీ పెట్టేలోగా!”
అర్ధాంగి మాట
నూతి లాంటి వంటిల్లు దాటి
ఆ మనసుని తడిపేసింది

చిన్నితండ్రి, పుస్తకాల సంచి ఇంటిలో కనపడనప్పుడు
అవగతమైంది ఏంచెయ్యాలో!
రెండు నిముషాల వ్యత్యాసంలో
ఎన్నెన్నిమార్పులు!

ఆగని పిల్లల బడి బండి
పప్పు ఇంకాస్త ఉడికితే
బాగుండుననుకునే తల్లి మనసు
ఆలస్యానికి తను కారణం కారాదనుకునే
భావి భారత పౌరుడు;
ఎదురీతకు సిద్ధం చేసాయి
మనకాలం నాన్నని
కాలాన్ని కాదనలేని యుద్ధం కదా
ఈ జీవనం!!

శాంతి కపోతాలు ఆ పాఠాలతోటకి
గుంపులు గుంపులుగాచేరుతున్న వేళ.
పరబ్రహ్మ స్వరూపాన్ని ప్రసాదంలా ఎత్తుకుని
అంతర్వాహినీ లోకం లోనికి
అడుగుపెట్టాడా తండ్రి

తనతో తానై ఉన్న ఏకాంతపు తరగతి గదిలో
ఒక్కడే అనేకమైనట్టు ఆ సిద్ధార్థుడు
తండ్రి రాకను చూపులతోనే ఆలింగనం చేసుకుని
అడిగిన ప్రశ్న
"ఆలస్యం ఎందుకయ్యింది నాన్నా!"

రాత్రి నీకు వళ్ళు వెచ్చనైందిరా!
అందుకే వంటలో మీ అమ్మ ప్రేమ ఎక్కువ కలిపింది
తట్టుకోలేక అది కుతకుతలాడింది
ఉడికీ ఉడకని మాటల్ని వడ్డించబోయాడు అతడు.

"నేనడిగేది అదికాదు నాన్నా!
నువ్వు నేపడుకున్నాక ఇంటికొచ్చావు రాత్రి"
పెదాల్ని తాకిన బుగ్గ వెచ్చదనం
నిట్టూర్పుతో జతకట్టి గాల్లో కలిసిపోయింది

కాలాన్ని ఎక్కి
ముందుకు సాగే వీరుడు
యుద్ధం ఎంతకాలమో తెలియక
సతమతమౌతున్నాడు.

పసి మనసు
నిత్యం నాన్నొచ్చేదారిలో
దీపాలు వెలిగించి
ఎదురుచూస్తూనే ఉంది.

19.11.2014



## ✤ ఆ నోటిమాట ✤

పుష్కరం కిందట ఆ గోదారిగట్టునే
నాతోకలిసి పరిగెలు ఏరుకున్న తోటిపక్షి
ఈ ఉదయాన్నే వలసపోయిన దేశాంతరాల నుంచి
వాట్స్ యాప్ లో జంటగా పలకరించింది

"బావా చల్లగా ఉన్నావా!
నీ పెళ్ళిరోజు నీకు నిన్నైపోయినా
మాకు ఇంకా తేదీమారనందున
నిన్నిలా పలకరిస్తున్నా" అంది

నన్ను అన్నను చేసుకున్న ఆ ఇంటిలక్ష్మి
అల్లుడికి ఆశీస్సులు; వదినకి ఆప్యాయతా
అందించమనిబీ పెనిమిటికే ఫోన్ అప్పజెప్పి
మా మాటల మధ్యనుంచి తప్పుకుంది

ఎవరు ఎవరికి ఏమవుతారో అడిగించుకోకుండా
మా గురించి పిల్లలకి వీలైనప్పుడు చెప్పాలి
వరదగాలుల రోజుల్లో
ఒకరికొకరం చెల్లాచెదురవ్వకుండా
ఒకరిగుండెలో మరొకరం మారుగూడు కట్టుకుని
బ్రతికినకాలంలో మేం ఒక్కటిగా ఉన్నామని

నేను ఏటికి ఎదురీదుతున్నప్పుడు
ఒడ్డునపడాలని తపించిన ఆ జంట
నాకై ఎన్నో కన్నీటి రాత్రులైన ఆ జంట



అందరితో మనసారా చెప్పేమాట
ఆ తోటకొచ్చి అమ్మదీవెనలు అందుకున్నాకే
కడుపుపంటని పండించుకున్నామని

ఇప్పుడింతకాలం గడిచాక
బావపక్షి మాటల్లో ఏం చెప్పాడంటే!.
"పుస్తకాలు చదవడం,
చెస్ ఆడడం మర్చిపోయినా,
నీనుంచి దూరంగా వెళ్ళిపోయినా,
ఆరోగ్యం కోసం అప్పుడప్పుడు పరిగెడుతున్నా

ఓ గూడు కట్టుకున్నాక, మా జంట
తోడుకి తోడుని కనిపెట్టుకున్నాక
అమ్మ నాతో అన్న మాట గుర్తుపెట్టుకున్నా

"తోట భలే పెంచారమ్మా
ఇంత ఓపిక ఎలా వస్తుంది మీకూ!" అంటే
"పిల్లలెదిగిపోయారుగా
ఇక మొక్కల్నే పెంచాలి కదా" అంది అమ్మ
ఆ మాట పట్టుకునే పరాయిదేశంలోనూ
పట్టుబట్టి ఇంటిచుట్టూ
మొక్కలు పెంచుతున్నా" అన్నాడు
అమ్మమాటకు పట్టంగట్టాడని
ఓ పక్క ఆనందంగా ఉన్నా,
ఎంతమాట అనేసింది అమ్మ!!
నిజంగా నేనెదిగానా? అనుకున్నా.

23.4.2016



## ✤ అ-అమ్మ, ఆ-ఆవు ✤

ఇరకతరకల ఈ లోకంలో
తిన్నగా నడిచే ఓ మనిషిని కలిసాను.
ఆడంబరాల మేడలు అంబరాన్ని తాకాలని
పునాదుల్లో గోతులు తీసుకున్న మాట మరచి
రాత్రుళ్ళు బోర్లా పడే పిచ్చోళ్ళ రాజ్యంలో
నేనూ సభ్యుడినేనని
విడమర్చి చెప్పిన మనిషిని
మొదటిసారి కలిసాను.

పుబ్బకో పుష్కరానికో మంచానపడ్డా
అది ఆత్మహత్యా యత్నమేనని
రైతు తెలిసీ మనం తెలియక
పురుగుమందులు తిని-తాగే
పరలోకం పయనమవుతున్నామని
రోగాలు పైకి కనిపించే కారణాలని
విడమర్చి చెప్పినందుకు
కొంత ముందే తెలిసినా
ఇంతకాలం పూర్తిగా నమ్మనందుకు
నాకు తెగ సిగ్గేసింది

కొబ్బరిబొండంలో స్ట్రా లేకుండా తాగలేని నేను
ప్లాస్టిక్ బాటిళ్ళలో నీరు తాగి విసిరేసే నేను
శుభ్రతని పాటిస్తున్నానని
ఇంతకాలం భుజాలెగరేసినవాడ్ని

పళ్ళు తోమాలన్నా ఒళ్ళురుద్దాలన్నా
నీళ్ళు తాగాలన్నా, ఊరంతా ఊరేగాలన్నా
విదేశీ మోజు భుజకీర్తులై మోస్తున్నవాడ్ని
కమీషన్ల చేతివిదిలింపులే నా వాళ్ళకుతప్ప
నా కష్టార్జితమంతా
పరాయిదేశాలకే వలసపోతుందని
తెలిసినా పట్టించుకోని నేను

తొలకరి వాన తడిపిన మట్టివాసన
నిజాల గుట్టువిప్పితే
దిక్కులన్నీ ఒక్కసారి నాపై పడ్డట్టైంది
నాలుగురోడ్ల కూడలిలో నుంచోబెట్టినట్టుంది

తన తపోఫలమే ఖర్చులేని సేద్యమైనప్పుడు
ఆలోచనే రైతుల బలవంతపు చావులను ఆపే మంత్రమైనప్పుడు
తన మాట లక్షల మందికి ఆచరణీయం అవుతునప్పుడు
ఓమాట పంచుకోవాలనీ
అతని బాటని చూపించే వేలికొసనవ్వాలని

ఈ అక్షరాలు కవిత కాకపోవనీ,
మత్తెక్కించని మాటల మూటని
చిత్తుగా తాగిన వాడికి మజ్జిగ లెక్కన తీసుకువచ్చా
ఈ రోజే కలిహోసాను ఆ సామాన్యుడ్ని
నీరుకావి ఖద్దరు బట్టల మనిషిని

పెద్ద దేశాలను పోషించరాక
పేస్టు-సబ్బు వాడని వాడ్ని
కొండ కోతల వ్యవసాయం తల్లి గుండెకోతని తలచి
చాయ్ నీళ్ళు ముట్టని వాడ్ని

రైతుని బలవంతపు చావునుంచి
తప్పించాలన్న సంకల్పం

అమ్మకు ఇంటిపనుల్లో సాయం చేసే బిడ్డలా
నేలతల్లి సారాన్ని కాపాడి పెంచాలన్న బాధ్యత  అతడిది
ప్రకృతి పులకరించే ఆ పేరు
సుభాష్ పాలేకర్

శాస్త్రవేత్తల ముక్కున వేసుకున్న వేళ్ళు  వందల్లోనే ఉన్నాయి
ఒట్టిపోయినదైనా ఒక్క దేశీ ఆవు వెంటుంటే
30 ఎకరాల పంట
పెట్టుబడి లేకుండానే పండించొచ్చన్న మాట

అడవితల్లిని తడిమి చీడల్లేని పెంపకాన్ని
కొనకుండానే పంటలకు పంచాడంటే
'పిచ్చాడు' అనుకునేరు  అన్నల్లారా! అక్కల్లారా!!
40 లక్షల రైతులు పక్కరాష్ట్రాల్లో పక్కాగా నమ్మారు

ఆధునిక వ్యవసాయం అప్పులతో నలిపేస్తుంటే
అసలు కారణాలను స్పృశించిన మూలకణం ఇతడు
చుక్కల్లో ఉన్న సాగుని చంకనెత్తుకుని
ఆడిస్తున్నాడు.

బెల్లం చుట్టూ చీమలు చేరినట్టు
జీవామృత మిశ్రమాన్ని ఎరవేసి
వానపాముల్ని రప్పిస్తాడు
ఈ కర్షకమిత్రుని రైతుమిత్ర ఆకర్షక మంత్రం
గో మూత్రంతో శుద్ధి చేసిన దేశవాళి విత్తనం
ఇది పరిశోధనల్లో నిగ్గుతేలిన
కామధేనువు సహజాతం

నమ్ము మిత్రమా ఈ మాట
నిప్పులేని ఆలోచనలలో ఉన్నవాడి కంటికి
ఎండుటాకు ఎప్పటికీ మండదు.
పెట్టుబడి లేని వ్యవసాయం చేసేవాడి
పొయ్యి తప్పు చెయ్యి కాలదెన్నడూ

తెలుసుకో !! తెలియజెప్పు నలుగురికీ
ఈ పద్ధతి భూసారం పెంచేదేకాదు
ఎలా బతకాలో చెప్పే జీవనసారం
ఇల్లు గుల్లవ్వడం నేల గుల్లవ్వడం
ఒక్కటి కాదు నేస్తమా!!
బతుకు డొల్లవ్వడానికీ,
మొక్క మొలవడానికీ తేడా ఉంది.
బ్రతికిస్తున్న దైవాలకు దణ్ణం పెట్టి
అ ఆ లతో
మళ్ళా జీవితాన్ని చదవడం మొదలెడదాం
అ–అమ్మ  ఆ–ఆవు

06.06.2013

## ✤ నా అస్థిత్వం ఒక వస్తువేగా! ✤

ఏమి చేద్దామనుకుంటావురా!
తాత్కాలిక శతమర్కటా!!
అన్నిరోజులూ ఒక్కలానే మొదలౌతాయి మరి

ప్రభాత కరదర్శనం; కరాగ్రే వసతే లక్ష్మి
ఇంటికి వస్తే నా లక్ష్మి కనిపించని రోజుల మాట ఇది

తన శరీరం తప్ప వేరొక ప్రాణేదైనా కనిపిస్తుందేమోనని
తరువాత తేరిపార చూస్తావు
అద్దంలాంటి ఇంటిని పెద్దగా చిందరవందర చేయలేని
నీ జేబు సామాన్లు  విడిచిన బట్టలు
పక్కకిలాగితే ఆక్రమించుకున్నంత జాగా కాదు
ఈ ఏకాంతం నీ జీవితంలో
చీమ కూడా కనిపించని అంతస్తుల అద్దెకొంపలో
నీ అస్థిత్వం ఒక వస్తువేగా!

మౌనం మూర్తీభవించిన పనిపిల్ల  వచ్చినచప్పుడో
వెళ్ళినప్పుడు 'తలుపేసుకో సారూ' అన్న సూచనో
నిన్ను అప్రమత్తం చేసే రెండు క్షణాలు
నువు ప్రాణమున్న జీవానివని గుర్తుచేస్తాయి

ధ్యానంలోంచి లేచినట్టు
ఏకాంతమందిరంలోంచి జనజీవన స్రవంతిలోకి
వడివడిగా ఒక దూకు దూకుతావు.
హోఇక రోజంతా నీదికాదు
ఇక ఇల్లుచేరే వరకూ  నువ్వు నీలో ఉండవు.

నీవే నావైనట్టు జనసంద్రాన్ని చీల్చుకుంటూ
కనిపించని గమ్యం వైపు సాగిపోతావు
బంధాలు తోడున్నప్పటి ఆకతాయి మనసుకు,
ఆనాటి ఉడికించే మాటలకు
అసలు అర్థాలు ఇప్పుడే తేటతెల్లమవుతాయి.
ఎటుచూసినా ఒక తెలియనితనం
నీదికాని పరధ్యానంలో లోకం.
అప్పుడే తెలుసుకుంటావు
నీ లోకం వేరొకచోట ఉన్నదని

నిన్నే కలవరిస్తున్న నీ నేస్తాలకు నువ్వు అందవు.
మాటల్లో ఒలికేవి పనుల్లో పలికేవి ఎన్నున్నా
నీ ధ్యానంలో నిలిచేవి జన్మ బంధాల అనుభుతులేనని
నిముషాలు యుగాలుగా మారే రోజుల్లో నువ్వో యోగివి

తపస్సు ఏమిటో ఆ మాత్రం ఎరుగవా!!
వెనక్కి వచ్చే రైలు బండి కూత కోసం
సాగనంపిన క్షణం నుండి పడికాపులు కాస్తున్నావ్
సహచరి ఊరెడితే ఏ తోడు కావాలిరా!
తిరిగివచ్చే తన తప్ప!!

రిప్వాన్ విన్కిల్ లాంటి ఎదురుచూపుల జీవితంలో
అప్పుడప్పుడు వినిపించే స్నేహపు పలకరింపులు తప్ప
సినిమాకథల్లో తప్పులను చూసి నవ్వుకోవడం తప్ప
ఎదురుచూస్తూ కూర్చోవడం తప్పు కాకపోవడం తప్ప.



## ✤ ఓ పంది గోల ✤

ఓ పంది పిల్ల పొద్దున్నే వాళ్ళమ్మని అడిగింది.
ఫాదర్స్ డే ఏంటమ్మా
ఎవరో అంటుంటే విన్నా అని

పిల్లా! పిల్లా! మనుషులకో రోగం!!
ఈ లోకంలో ఎక్కడ మరిచిపోతారోనని
ఓ రోజు నాన్నని తలుచుకుంటున్నారని చెప్పిందిలా తల్లి
కన్నది అమ్మ-నాన్న కలసి అయితే
నాన్నని విడిగా
ఈ ఒక్కరోజే ఎందుకు తల్చుకోవాలమ్మా!
మళ్ళా అడిగింది ప.పి.

తల్లిపందికి ముచ్చటేసి
మనుషుల కథ చెప్పడం మొదలెట్టింది.

మనలానే తినీ-తిరిగే మనుషులలో
ఎద్దుల్లా ఉండే ఒక రకముంటుంది.
వాటిల్లోవాటికి పెళ్లాడడం అన్న తప్పనిసరి పని ఉంటుంది.
ప్రేమించడానికి అవసరం లేని డబ్బు
పిల్లల్ని కన్నాక పెంచడానికి అవసరమౌతుంది

సంతు కోసం సంతోషాన్ని ఖర్చుచేసే బలహీనత
మగమనిషికి ఉందని తెలిసిన ఆడమనిషి
ఓ అరగంట కష్టాన్ని సంతోషంగా మార్చి
ఏడాదిలోగా వడ్డీతో జమకడుతుంది

ప్రాణం పోసుకున్న వడ్డీనే మనుషులు బిడ్డ అని
అంటారు.

ఏడుస్తున్న బిడ్డని పొత్తిళ్ళలోకి తీసుకుంటుంటే
కనిపించేది నాన్న నవ్వే కాని ఆ రోజునుంచే పెంచడానికి
ఏడుపుని నవ్వుగామార్చే ఉయ్యాల జీవితం
నాన్నదవుతుంది.

అమ్మ ఆ తరువాత నాన్నని ఏదన్నా ఇచ్చి సంతోషపెట్టిందంటే
అది బిడ్డ బాగోగులు చూస్తున్నందునే
ఈ రహస్యం ఆ ఇద్దరికే తెలుస్తుంది.
బిడ్డంటే భర్తకు భార్య చెట్టుకి కాసే తినలేనిపండు.

ఇలా నాన్నన్నమనిషి
తన రెక్కల కష్టంతో ప్రేమ నూనెని పిండిచ్చే
గానుగెద్దులా మారిపోతాడు
ఆ నూనెతో అమ్మలు చెయ్యలేని పనులేం లేవు

నూనె సరిపోయిందా నాన్న హీరో అవుతాడు
లేదా హిరణ్యకశపుడు అవుతాడు.
ఇంత నూనె తియ్యమని అడక్కపోయినా
నాన్నలు నూనెని తీస్తూనే ఉంటారు.
పిల్లలు వారి తల్లులు ఎంత నూనె కావాలో
అంత ప్రేమా కురిపిస్తూనే ఉంటారు.

కొందరు నాన్నలుంటారు
మధ్యలో కాడి వదిలేసి పారిపోతారు.
కొందరు జీవన ప్రవాహంలో జారిపోతారు.
కొందరు మెడలు ఒరిసి నీరసంగా వాడిపోతారు.
అప్పుడు తిట్టుకున్నా ఉపయోగం ఉండదు కాబట్టి
ఏడాదిలో ఓ రోజు
ఇలా బొట్టుపెట్టి

సంతోషంగా ఉంచాలని మనుషులు కనిపెట్టారు
అని చెప్పింది తల్లిపంది

అయితే భలే
నేను నాన్నపందికి రోజు కాకుండా
ఏడాదికి ఈ ఒక్కరోజే ముద్దెడతా
పైకి అనేసింది పందిపిల్ల
ఈ మనుషులున్నారే!!
తిట్టుకుంది తల్లిపంది తలపట్టుకుని

19.6.16



## ✤ బొమ్మరాళ్ళు ✤

పేగు బంధాలు ఊళ్లేలుతున్నాయి.
రెక్కలొచ్చిన పిల్లలు పల్లె వదిలారో ఇల్లేవదిలారో
కొద్దిగా ఎదిగి పోయారు

ఉన్నారన్న మాటకి అమ్మా! తిన్నావా అంటూ
పడుకునే ముందు ఫోను మోగుతుంది
మాటల్లో మనుమల ముచ్చట్లు

ఆత్రం కొద్దీ వినేది ఉండదు
అలా పెంచమనీ, ఇలా చదివించమనీ
ఇక విసుక్కోవడం పిల్లల వంతు
పాపం 'అమ్మ కేమీ తెలియదు'
ఈ వాదనకు మరో–సగం బలం చేకూరుతుంది

అసలు చురకలు అంటిస్తే
వడ్డీ ముద్దు మాటలు వెన్న పూస్తాయి
కొమ్మల్లో కోకిలల్లా వినిపించే సంగీతమేగా
వంశాంకుర రాగాలు

ఊహల్లో తప్ప కంటికి దొరకరు
వసంతం వేసవి సెలవుల్లోనే వస్తుంది
తోటా– దొడ్డీ ఆ రోజుల కోసమే పూసినా కాసినా
ఊసుపోని పునికింతాలు నెలల ముందే మొదలౌతాయి

ఇంతకాలం కాయలు కాచిన కళ్ళు చేతులూ
చెట్లకూ కాయిస్తాయి, పూలు పూయిస్తాయి

అరిగిన మోకాళ్ల మధ్య తిరగలీ తిరుగుతుంది
నలిగిన వేళ్ళ మధ్య కవ్వం చిలుకుతుంది.
వెన్న కాగి నెయ్యవుతుంది
వెన్ను అరిగితేనే సున్నుండలు చిమ్మిలీ బలమౌతాయి

అమ్మ ప్రేమని పిల్లలు పంచుకుంటారు
ఎవరమ్మమాట వారి పిల్లలే వింటారు
ముసలి వాసనలకు మనుమలు దూరంగా ఉంటారు
కడుక్కోవడం వచ్చేసింది కదా బుగ్గల్ని కూడా

అవసరాలు మారాయి కాలం కదిలినట్టుండదు.
కన్నుల పండువ కరిగిపోతుంది.
బతుకు నావ లంగరు ఎత్తే వేళ తల్లితీరం పోటెత్తుతుంది
వ్యాపార పవనాలు బంధాల్ని ముందుకి లాగుతాయి
వసంతం పారి పోతుంది
శిశిర జీవితాల్లో మిగిలేవి ఎదురు చూపులే!!

బిడ్డలు రత్న మాణిక్యాలు
ఫోను పలకరింపులు మాత్రం ఉద్యోగాల్లా చేస్తారు
చిన్నికృష్ణులతో అప్పుడప్పుడు మాట్లాడిస్తారు
అమ్మమ్మలు యశోదల్లా నానమ్మలు రాధికల్లా
ఆరాధనలో గడిపేస్తారు
మనసు లేని బొమ్మరాళ్ళు
వారి జీవితంలోంచే ముందుకు చూస్తారు.
(రెండు తరాల వారధి తరానికి )

## ✤ ఉప్ప 'ధనం' ✤

నా ఉద్వేగం ఎక్కడ ఎందుకు అంకురించినా
ఎఱ్ఱ మందారాల్లాంటి నెత్తురు కణాలను
తెల్లమల్లెల్లాంటి కన్నీరుగా చిలికించినా
మారని గొప్పతనం నాలో ఉప్పదనమే

నా స్వేదం ఎక్కడ ఎందుకు చిందించినా
నిర్వేదం నుదుటన నాట్యం చేస్తున్నా
నీరు చల్లినట్టుగా రగిలి పొగలు కక్కించేదీ
మారని తరాల స్వరాలని బయట తడిపి
లోన చల్లబరిచేదీ ఈ ఉప్పదనమే

మనసు కరిగించే ఉప్పు మంచు కరిగించే ఉప్పు
ఈ తెల్ల బంగారం ఖరీదు మనిషి నిలువెత్తు
పుణ్య పురుషులు కర్పూరాలో కాదో
నా మనుషులు రస కర్పూరాలే
చిటపట జ్యోతుల హారతులే

మనిషి జీవించివున్నాడంటే
కష్టాల కొలిమిలో
ఉప్పు  నిప్పుతో చిటపటలాడుతున్నట్టే
ప్రేమ పాశంలో పడి నీరుగారి కరిగిపోతున్నట్టే
ప్రేమ తియ్యదనంలో కలిసి
మనసు నిర్జలీకరణాన్ని నిరోధిస్తున్నట్టే

ప్రేమంటే ఏదో ఓ రుచి కాదు
జీవితం-రుచి తెలిసిన కమ్మని కూర



అమ్మ అప్పుడే పట్టిన ఆవకాయ పచ్చడి
ప్రేమంటే జీవన రసధుని
మధుర భావనా లాహిరి
జీవితం ఆ ప్రేమ కోరే మనసు చేసే సాగర ఘోష
సాగర తీరాల అవతలి జీవితాలూ ఉప్పనే నేస్తమా!
ఆకర్షణల ఉప్పెనల తీపిని పంచకు
చితిమంటల ప్రేమను తియ్యగా ఎంచకు
ఆకురాయి అగ్గిరవ్వలను కళ్ళతో ఒంపకు

ఉప్పదనం లేని చోట జీవితం చప్పగానే ఉంటుంది
గొప్పతనం కోరే మనసుకు నా మాట ఉప్పగానే ఉంటుంది
వడ్డించిన విస్తరిలా ఉండదు జీవితం ఎన్నడూ
అయిన కూట్లోకి అయిన కూర ఉంటే చాలదా

సమన్వయం లేకపోతే
జీవితం
ఉప్పులేని చప్పిడిమెతుకుల ముప్పై
తిప్పలు పెడుతుంది



## ✤ బేరం- నేరం ✤

ఓయ్! తోటకూరా!!  ఎలా ఇస్తున్నావ్?
'పదికి 4 కట్టలమ్మా!'
మరి "8 ఇవ్వవా!!"
'కిట్టదమ్మా.' '.ఐతే పో.'
ఇది నే చూడలేని వ్యధ

ఆటో! వస్తావా!!
"మీటరు మీద 20 ఎగస్ట్రా సారూ?
ఎందుకివ్వాలి!! వద్దులే బాబు "
ఇది నే రాయలేని కథ
నాకు ఈ తంతే  చీదర.

చిల్లర చాలక చేతుల్ని నలుపుకున్నా
సరుకుల్ని కొనడం
ఎన్నోసార్లు విరమించుకున్నా కానీ
పదిపైసలు కలిసొస్తాయని
అడ్డదిడ్డంగా బేరానికి దిగలేను

బేరమేమంత నేరమా!!
అని అడగొద్దు నన్ను అతిశయంగా
ఆ బేరాలు నాదగ్గర సాగవు

కోట్లు మింగిన గద్దల్ని
సంఘటితంగా గాలికి వదిలేసి
పిచ్చుకల జీవితాలతో పరాచకాలాడాలని

తోపుడు బండితో పావుబేరం
కూరల గంపతో సగం బేరం సబబేనని
ఏ బళ్ళో చదివాము! ఈ పాఠాల్ని!!

ఇరవై రూపాయిలు ఆశించే రిక్షావాడికి
పది రూపాయిలే చాలంటావా!!
దుమ్మెత్తిన నీబూటుని గుండెలకు హత్తుకుని
మిసమిసలద్దేవోడికి సగం డబ్బులతో సరా!!
పావుకేజీ తూకానికి చటాకు కొసరు కోరతావా
ఇదెక్కడి న్యాయం?

అర్థరూపాయి రేటు పెంచి
ఐదు పైసల డిస్కౌంటులిస్తుంటే
షాపింగ్‌మాల్ సంస్కృతికి
తలవంచి కొనుక్కునే మనకు ”
బేరాలాడడానికి
అసంఘటిత కార్మిక లోకమే దొరికిందా?

పెట్టుబడిలేక వంకాయలవడ్డీ కింద
ఉదయాన్నే తొంభై రూకలు అప్పు తెచ్చుకునే వాడు
రాత్రికి వంద తిరిగెలా ఇస్తాడు! నీ లెక్కల్లో!!

బేరగాడి రూపంలో నవ్వుని చిదిమేసుకుని
ఆరిందాగా అన్యాయంగా గదమాయించకు
చేపల మార్కెట్టుని చూపి నను సముదాయించకు

నీ వలలో ఎవరో పడ్డా పడకున్నా
నీకు రాని వల విసిరే ఒడుపుని,
కాలే కడుపుని గౌరవించు

రేటుని బట్టి వస్తువుండదు సోదరా
అవసరమే అమ్ముడవుతుంది అంగట్లో



నీ అవసరాల గాలానికి  బేరం ఎరవేసి
అర్థాకలిని అమ్ముకోనివ్వకు
అపనమ్మకాన్ని నమ్ముకోనివ్వకు

ఏ అర్థరాత్రో అవసరమొచ్చినప్పుడు
ఆపిన ఆటో అన్నని ఆప్యాయంగా అడుగు
మీటరు మాటెత్తకుండా
భద్రంగా గమ్యం చేర్చమని

లాభనష్టాల తరాజును తూచకుండా
నాలుగు మాటల్ని పంచుకుంటూ
రోడ్డు భద్రత చూసుకుంటూ
ప్రయాణం ముగిసేదాకా

ఇక లెక్క తేలినట్టే అనుకున్నాకా
కనీసం కళ్ళలో నవ్వులతో ఒక మెరుపు మెరిసినా
రెండు చేతులు ఒక్క క్షణం పెనవేసుకున్నా

బేరాలాడడం బేకార్ అని
ఇద్దరు శాశ్వతంగా గుర్తుంచుకున్నట్టే
నా క్లబ్‌లో  మరొకరికి సభ్యత్వం దొరికినట్టే

19.6.13



## ✤ ON THE OTHER HAND ✤

ఒబామా, మోడీ, అమితాబ్, సచిన్
ఓ పోలిక గొప్పేం కాదు గానీ
ఆ సెయ్యి అలవాటు ఇబ్బంది పెట్టేస్తోంది
పుట్టినకాడ్నుంచీ

ఎలా పుడుతుందో ఈ ఎడమ అలవాటు
జనాలు మనల్ని వేలెత్తి చూపడానికి
మార్చుకునే వరకూ వెంటపడడానికి

కలిసిపుట్టిన వాటిని విడదీసి
తెలిసీ తెలియని విషయాల్ని కలగలిపి
కుడి మంచి ఎడమ చెడు అని ఇట్టే నమ్మిస్తారు
మనల్ని ఓ గాడిన కట్టి ఆడిస్తారు

పురసెయ్యోడి తలసరి ఆదాయం
సదరు కుడిసేతోడు కన్నా తక్కువే
అని సర్వేలు తేల్చేసి నప్పుడు
కుడిచేత్తో కొబ్బరికాయను కొట్టలేనితనానికి
గుళ్ళో రాతిగుండె నాపై పగబట్టినట్టనిపించింది

పనీపాటా అన్నీ ఉన్నా
పనిగట్టుకుని తట్టుకోలేకే
ఇలా మొరపెట్టుకుంటున్నా;

పడ్డోడి బాధ పక్కోడికి
ఏడుపులెక్కనన్నా తెలవాలి కదా



నాకు తెలుసు మీకిది ఓ నవ్వులాట

చిన్నప్పుడెప్పటి మాట
తినేటప్పుడో, రాసేటప్పుడో
ముందుకెళ్ళేది ఎడమసెయ్యే!
టపీమని తగిలేసేది ఓ దెబ్బ దానిమీద
వెనకనే "ఏరా తేడా తెలియట్లేదా" అన్న మాట
వివక్ష ఊళ్ళోనే కాదు వంట్లోనూ ఉంటుందని
నా కప్పుడే తెలిసొచ్చిందన్నమాట.

రాయడం కుడితోనే ఏదోలా నేర్చినా
నా గుండె ఎడమవైపే ఉండిపోయినందున
ఆ మారిన అలవాటు నాతో నేను చెప్పుకోలేని బాధ

కాళ్ళపని చేతులు చెయ్యవు సరే
కుడికి ఇచ్చిన విలువ ఎడమకి ఎందుకివ్వరో అనిపించేది
ఒకటి ముందుకి మరొకటి వెనక్కి
వాడే అలవాటుకి ఆద్యంతాలు ఎక్కడో

నా దేహమే దేశమైనట్టు
లోపల మొలకెత్తే ఆలోచనలనూ
నాలోని అసమానతలను రోజూ గమనిస్తున్నాను
కుడి ఎడమైతే పొరపాటు లేదన్న
కబుర్లలోతు తెలియదు కానీ
ఎవడిపని వాడు చెయ్యాలని చెప్పడంలో
శాస్త్రం కన్నా ఝూంకారమే ఎక్కువ కనిపించేది

కుడికాలుని ముందుపెట్టాలంటే
ఎడమపై నిల్చోవాల్సి రావడం ఎంత నిజమో
కుడి చేయి కడగడానికి ఎడమ అంతే అవసరం కదా
అప్పుడప్పుడు తనే నిజమని, సహజమని
ఎడమచేతికి చెప్పాలనిపిస్తుంటుంది

అలా ప్రయత్నించినప్పుడల్లా
కుడి చేయి దాని గొంతుని గుప్పెట్లో మూసేసి
కిందకు లాగేసేది
తలతో పాటు అదీ వాలిపోయేది
నాది కాకపోతే గోదారి దాకా అని చూపించే
పక్షపాతానికి నా ఎడమ ఎప్పుడో వొలితిరిగిపోయింది
సహజసిద్ధమైన అలవాటుని పొరపాటు అన్నప్పుడే
నాకీలోకం ఎప్పటికీ తల్లకిందులే అని తేలిపోయింది

నా మనసు మాటను పాటించలేక
మాటలతో పొడిపించుకోలేక
కొన్నిలా–కొన్నలా అని
రెండిటితో సరిపెట్టుకుపోతున్నా

మారిన అలవాట్లలో నేనే చేతివాటమో
నాకే అర్థంగాక తికమకపడుతున్నా
తిండీ–తిప్పలను కుడికి అప్పగించి
అవసరానికి ఏది కుదిరితే అదే వాడుతున్నా

రాసే పనిని ఓ చేతికి గుత్తంగా అప్పగించేసి
మిగతావాటన్నిటికీ మరోచేతిని వాడాలనిపిస్తుంది

ఇంకానయం!
దేవుడు ఒక్కనోరే పెట్టాడు!!
తిన్న తరువాత చాల సమయానికి
అరిగే అలవాటుని భలే కనిపెట్టాడు!!

కడుక్కోవడం ఎప్పటికప్పుడు
రెంటికీ అవసరమైనప్పుడు
ఈ ఎక్కువ–తక్కువలు ఎందుకో!

ఎప్పుడైనా ఏ గొంతైనా
నన్నెవ్వరూ పట్టించుకోవడంలేదన్న అరుపు

వినపడినప్పుడల్లాజి
వాడెంత అదృష్టవంతుడో అని బుగ్గలు
నొక్కుకుంటున్నా

కసిగా పట్టించుకుని
'నువ్విలా ఉండూ నేనిలా ఉంటాను' అనుకునే కన్నా
ఎవడిమానాన వాడ్ని బతకనివ్వడం మిన్న  అని
జీవితానుభవంతో తెలుసుకుంటున్నా

18. 4. 2016



## ✤ అడగకు నన్ను!! ✤

పక్కెక్కడ తడిపేవోనని
నడినిద్రలో నిను నడిపించి
బిగబెట్టిన చిట్టిపొట్ట నా రెండు వేళ్ళ మధ్యనుంచీ
నీరు కారుస్తున్నప్పుడు
ఓ భయం మాయమౌతుంది నాకు

మంట మీద మరిగి సెగలు కక్కే నీళ్ళ గిన్నెను
స్నానానికై మునివేళ్ళమీదే మోసుకు పోతుంటే
తుంటరిగా నువు అదాటున వచ్చేలోగా
నీరు తొరుపేసుకున్నప్పుడు
ఓ భయం మాయమౌతుంది నాకు

రాత్రి పరదాకింద సరదా కుమ్ములాటల్లో
నీ పంజాకి ఎదురు నిలచిన నా తనువు అదిరి;
నెప్పి ఎటువైపు ఎక్కువో
మెలకువలో లెక్కగట్టలేక పోయినా
భయం పోగొట్టుకుంటుంది నీ పక్కన నిద్రలో .

చిన్ని- చిన్ని భయాలకే బెంబేలెత్తే నేను;
బాధగా నువ్వడిగిన ప్రశ్నల్లో
"అన్నల్ని-అక్కల్నిలి
వాళ్ళెందుకు కాల్చారని అడిగితే !!"
ఏ భయం లేకుండా ఎట్లా చెప్పను!

మనిషి ప్రాణం బొమ్మతుపాకీ బిళ్ళలెక్కని;
సిద్ధాంతం అనే భూతం ఒకటుంటుంటుందని, తెలిసిన నేను..

రాద్ధాంతం చెయ్యలనుకునే బూచోళ్ళు
నీ బడి తలుపులు బద్దలుకొట్టుకు
రాకుండా ఉండాలనే స్వార్థంలో
ఏంచెబుతానో ఏమో!

QUESTION BANK ని
కడుపులో పెట్టుకుతిరిగే నీకు
ఏనాటికైనా ఒక నిజం తెలియాలి
నీ నాన్నకన్నీ తెలియవని

చనిపోవడానికి బతికిఉన్నదానికీ మధ్య
లోలకం ఈ జీవితమని

విద్రోహమో, ప్రమాదమో;
గంటలా మోగినప్పుడల్లా
ఏం నేర్చుకున్నామో ఎవరికి వారు
బేరీజు వేసుకోవాలని
నీ అంత నువ్వే తెలుసుకుంటావు!

మనుషుల్లో పువ్వులూ-ముళ్ళూ
పులులూ, లేళ్ళు అన్నిగుణాలూ ఉంటాయని
ఇంగితం మరచిన జ్ఞానంలోనే
జంతువులతో తమని తాము పోల్చుకుంటారని

వైరుధ్యాలూ-వైరాలూ
హింసలూ, హత్యలూ సహజధర్మమని
పసివాడికీ, కసాయికి సమాన స్థాయినిచ్చేది దైవత్వమని
బాణంతో లేడిని చంపడమూ
మానవ తత్త్వమేనని

మనిషికి కావలసింది మనిషేనని,
మానవత్వం, దైవత్వం రెండూ కాదని



ఏనాటికైనా నీ అంతట నువ్వే తెలుసుకుంటావు

నీ పుస్తకం పోయినప్పుడు
పంచుకోవడంకోసం ఇద్దరుండాలని
నువ్వు నడిచేది ముందో-వెనకో తెలుసుకునేందుకు
మరొకడు తోడుండాలని

నువ్వు- నువ్వు గా ఎదుగుతూ
మరో చెట్టుండే తోటలో పండాలని

స్వపర పక్షపాతం లేని సాంఘిక న్యాయం
ఒకటుండాలని
కాలం కలల్ని కూల్చినా కొనసాగించడానికి
ఒక తరం మిగిలుండాలని

ఏనాటికైనా ఈ నిజం తెలియాలి
నీ అంత నువ్వే తెలుసుకుంటావు

అప్పటిదాక
ఈ చిన్ని భయాలతోనే బతకనీ నన్ను
పెద్ద-పెద్ద ప్రశ్నలతో భయపెట్టకు నన్ను
నిద్రలో ఉన్ననిన్నిలా నడిపించనీ నన్ను

(ఉగ్రవాద దాడిలో రాలిపోయిన పెషావర్ బడిపిల్లలను తలచి)

17.12.2014 #India with Pakisthan

## ✤ నాదేశం ఓ పూల చెట్టు ✤

పసుపుపూల చెట్టుకో ఎర్రపూవు పూచింది
అంతలోనే తన రంగుని కని అనుమానం లేచింది
పొరపాటున నేను ఈ మట్టిలోన పుట్టానని
కలిసున్నా మీరు నన్ను విడదీసే చూస్తారని
వదిలేస్తే తనమటుకు స్వతంత్రంగా ఉంటానని
అందంగా ఊగుతూనే బింకంగా చెప్పింది

పూలు కొన్ని నవ్వాయి, తల్లివేరుని అడిగాయి
పిల్ల అనే మాటల్లో మర్మమెంత ఉందోనని
రాలుపూల పిల్లల్ని మోసి ఉన్న తల్లికదా
మాట విన్న వెంటనే ఒల్లుజలదరించింది
దుఃఖమెంత వస్తున్నా మాట తమాయించింది
ప్రేమతోనే పిల్లల్ని ఇలా పలుకరించింది

మీరు లేని రోజుల్లో మాట ఒకటి చెబుతాను
మొక్కలా నేనప్పుడు ఆకులనే కన్నాను
నేలతల్లి సారాన్ని నీళ్ళతోటి పీల్చాను
మొగ్గతొడిగాకనే నన్ను నేను కనుగొన్నది
ఏరంగో ఏమిటో లోకమంత పచ్చ నాకు
పూలమొక్కని అంటారని నన్ను నేను విన్నది
తోటలోన నాలానే మొక్కలెన్నో ఉన్నాయి
గాలి పలకరింపులే తప్ప నడిచినే వెళ్ళలేను

ఏ పిట్టో ఏ పురుగో వచ్చి నాపై వాలేది
మరోమొక్క కేసరాల పుప్పొడిని రాల్చేది

బలమైన పూలని రంగు రంగు బాలల్ని
అందంగా కంటున్నా నందుకే అన్నది

ఎర్రపువ్వా! ఏమయింది నీకసలా
నీచుట్టూ పసుపుంటే నువ్వు గొప్ప కాదా!
ఏదోరోజు అందరం రాలిపోయెవారమేగా
రంగు మరచి పువ్వువని మురిసిపోవేలా!

ఎవరో ఒకరు ఎపుడోకపుడు దూసేస్తారని
దండకోసమో పూజకోసమో మోసేస్తారని
అయితే మాత్రం మమ్మల్నిపుడే వదిలేస్తావా!
పరోపకార పరమార్థానికే విడిపోతావా!!

నువ్వెక్కడున్నా నిన్ను పువ్వనే పిలుస్తారు
గంధాన్ని బట్టే నీ పేరు జపిస్తారు
ఏపుట్టుక కైనా కారణమొకటి ఉంటుంది
నీకు ఈ నేలన ఋణానుబంధముంది

నీలాంటి పువ్వుల్లో నువ్వొకత్తవే లేవు మాకు
విడివడ్డంత మాత్రాన నువ్వు-నువ్వు కాలేవు
నలుగురితో మెలగకుండా ఏల రాలిపోతావు
కలిసి ఉంటేనే గొప్పని అందరొప్పుకుంటారు

నీలానే నేనూ మూలాల్ని మరిచొస్తే
ఈ గాలి నన్ను మోసుకెళ్ళిపోయేదా
నీరు-నేల నన్ను నిలవనిచ్చేనా
వసంతమే తరలొచ్చి మన ఇంట విరిసేనా

ఓ చిన్నారి పువ్వా, చెరగని చిరునవ్వా
మొక్క -నీతల్లి, తోట-నీఊరు
నీరంగు ఏమైన నువ్వు గోగుపూవు
వెన్నెల్ని కురిపించే పనిమానుకోకు



ఏ గాలి నిను మోసి ఏ కోనకెగసినా
ఏదేశమేగినా ఎందుకాలిడినా
నమ్మినదేమైన, నమ్మనివెన్నున్నా
ఒకే మట్టి నిన్ను నన్ను కలిపిమోస్తుంది

రాలాక చేరాలి ఆ మట్టినే ఎవరన్నా
మన మూలాలు మట్టి, మన కాలాలు మట్టి
మట్టి కణం చెట్టుఋణం కాదుగాని
నీలోని అణువణువున మూలరూపం మట్టి

మట్టి మాట పక్కనెట్టి వెయ్యి నువ్వు మాట్లాడు
అవన్నీ అబద్ధాలునను కన్న మట్టితోడు

తోడపుట్టిన పూలన్నీ అవునని తలూపాయి
అంతలేసి మాటలన్నచెట్టుతో పాటుగా
వీచెగాలి సైతం పాట వంతపాడింది
పంతం పట్టిన పువ్వుకి కోపమొచ్చినట్టైంది
నిక్కు దిగిపోయిందని ఇంకాఎరుపెక్కింది
కొత్త రంగుపువ్వులను ఇంకా కనాలనే
ఈ దేశం మొక్క ఎదురుచూస్తుంది

27.2.2016



## ✤ # 2045 INITIATIVE ✤

ఇప్పుడేదో గొప్పగా ఉన్నానని కాదు;
అలాఅని మనిషితనంలో తక్కువేం లేను.
అందరికీ ఉన్నట్టే కొనున్నాయి నాకు

చమట చుక్కలు-కన్నీళ్ళు
రూపాంతరం చెందిన
సంభోగానంతర రేతస్ఖలన కణాలు
ఇంకా ఈ నేలన మిగిలున్న కొన్ని ఋణాలు

మరి నా మెదడు మరమనిషితో అనుసంధానిస్తే
మరణించాక కూడా నే బ్రతికివున్నట్టేనా!!
నా జైగోట్‌తో ఉద్భవించిన క్లోనింగ్ ప్రతిరూపం
అసాధ్యంగాక సాకారమైతే
ఆ సదరు స్వరూపుడు నేనన్నట్టేనా!!

మూలాల్ని మరచి విన్యాసం చేస్తున్న లోకంలో
నే మర్త్యుడినా కానా!
వంటబట్టిన సిద్ధాంతాలను నమ్మకాలుగా మార్చి
ముందుతరానికి మనుధర్మంలా అందిస్తానా! లేనా!!

ఏతావాతా పోయాక పైనుండడం నిజమైనా
పుట్టబోయే క్లోనింగ్ ముద్రా రాక్షసులబీ
ఆవిష్కరణ కాబోయే నియో మానవతామూర్తులతప్పులకి
ఏ చిత్రగుప్తుడు చిట్టా తయారు చేస్తాడు!
శాఖా కార్యాలయాల్ని ఎక్కడనుంచి నిర్వహిస్తాడు!!



మిత్రులారా! మన్నించండి నన్ను
అర్ధాంతరంగా కూత ఆపేసి
తొడగొట్టి బరిదాటడానికి రాలేదు
ఇక్కడ కూతలానే ఎవడి ఆట వాడిదే
నేను నాతోనే ఇంకా జట్టు కట్టలేదు

బలవంతాన ఆడాల్సిన ఆటలో
బరిలోనా-బయటా నాలాంటి నన్నే ఉంచితే
నాతో నేను ఎలా ఆడుకోవాలి!!

ఎవరు ఎవరికి ప్రతిక్షేపం!
ఎవరి ఓటమికి ఎవరి గెలుపు ప్రత్యామ్నాయం!!

నాకిపుడు నాతోనే మాట్లాడాలనిపిస్తుంది
నాకు నేను తర్ఫీదు ఇచ్చుకోవాలనిపిస్తుంది
ఏ కారణం చేతనైనా
శాశ్వతంగా ఉండిపోతానేమో అని
భయమేస్తుంది.

జీవితేచ్ఛ ఇంకా మిగిలే ఉంది
అయినా సరే ఓ బ్రతుకు బ్రతికాక
అందరిలానే బంధాల్ని వదిలి వెళ్ళలేని బాధని
అనుభవిస్తూనే పోవాలి
తేలిగ్గా వదలలేని తెంపరితన్నాన్ని
చావు ముంగిట ప్రదర్శించాలి
నేనన్నవాడ్ని ఏలోకంలోనైనా నేనే ఉండాలి
నా తరువాత నేను నైరుప్యంగానే నిలచిపోవాలి

నన్ను తప్పొప్పుల చిట్టాగానో,
అనుభూతుల ఘట్టాలుగానో అంతా గుర్తుంచుకోవాలి
పువ్వునూ, పిట్టనీ, పిల్లనూ, నవ్వునీ
ప్రేమించే మనసు అందరిలానే వీడికీ ఉందని

అందని ద్రాక్షల కన్నా
అందుకున్న సీమసింతకాయలంటేనే మక్కువ చూపాడని
ఎవ్వడో ఒకడు నా గురించి రాయకపోడు

నా రాతల్లోంచి మీ మాటల్ని వెతుక్కుంటున్నప్పుడు
మరో యశస్వి రాకపోనూపోడు
అయినా సరే అక్షరాలతో పలుకరించే నాకు
అక్షరాలలోనే బ్రతికే జీవితం కావాలి

కవిత్వానికందని భావనేదో
తెమ్మరెలైనా తలపులను తరలించుకుపోవాలి
మనసు మిగిలిపోయి మనిషిగా
ఏదో ఒకనాడు తెరమరుగైపోవాలి
ఈ రంగస్థలం మీంచి కనుమరుగైపోయాక
మీ తలపుల్లో నవ్వుతూనే మిగిలిపోవాలి

17.3.2016

(మనిషిని శాశ్వతంగా బ్రతికించేందుకు చేస్తున్న ప్రయత్నాలు పేపర్లో చదివి)



## ✤ అక్షరాన్ని నేనక్షరాన్ని ✤

అక్షరాన్ని నేనక్షరాన్ని
శబ్దం నా లక్షణం
పదే పదే ప్రయోగిస్తే భావం నా లక్ష్యం.
నా లక్షణంతోనే లక్ష్యాన్ని సాధించే మధురక్షణాన్ని.
లక్ష్యం నుండే నా జననం
లక్ష్యం లోకే నా పయనం
అక్షరాన్ని నేనక్షరాన్ని

విడిగా చూస్తే నా జీవితం అర క్షణం
నిఘంటువులలో నా లోతు అహోబిలం
నా పరిధి శత సహస్ర జ్యోతిర్వర్షం.
శబ్దార్థ సర్వస్వమూ నా సాక్షాత్కారం.
అరుణ కిరణపు తీక్షణాన్ని,
ధైర్యవంతుల లక్షణాన్ని
క్షరాన్ని కాదు నేనక్షరాన్ని
క్షయాన్ని కాదు నేనక్షయాన్ని

శాఖా గ్రంథాలయాలలో నిక్షిప్తమైన అవక్షేపాన్ని
నవీన విశ్వవిద్యాలయపు ప్రతి ప్రశాఖలో
అలక్ష్యం అవుతున్న అద్భుత నిక్షేపాన్ని

మాతృమూర్తి మాట వెంట నా విలువ అక్షరాలా అక్షర లక్ష.
నా మాతృభూమి పాట వెంట లక్ష అక్షౌహిణీల పై మాటే
సాహితీ గవాక్షం నుండి వీక్షిస్తే విరూపాక్షుని విశ్వ రూపాన్ని
నా ప్రాభవం గత జన్మపు మోక్షం

పద్యపు పల్లకీ కుదుపులకు సన్నబడిన
నుడికారపు నడుమును
నన్నయ నేర్పిన నడకకు
తిక్కన తీక్ష్ణ నినాదం తోడైతే
పోతన పూసిన తేనె పూతను
శ్రీనాథుని శృంగార నైషధాన్ని నే నక్షరాన్ని

విశ్వనాథుని కల్పవృక్షం కింద సేదతీరుతూ
కృష్ణశాస్త్రి మందారమారుతాల్ని ఆస్వాదించేనాటికి
నాది ప్రౌఢ వయస్సు
లుప్త శిల్పంమై జవసత్వాలుడిగిన
నాకు తిలోదకాలిచ్చింది తెలుగు త్రిమూర్తులు
వారి అంశతో దత్తాత్రేయుని రూపం వచ్చింది నాకు

శ్రీ శ్రీ రాబందుల రెక్కల చప్పుడుతో నిద్ర లేచా
మైలమ భీమన కలల ఖడ్గ సృష్టి చేశా
దాశరథి అగ్నిధారనై రుద్రవీణనై వినిపించా
సినారె విశ్వంభరలో నక్షత్రాన్నై దారిచూపా
శేషేంద్రుని శేషజ్యోత్స్ననై ఎర్ర కోరిక కోరా

ఇప్పుడు ఇప్పుడు ఇప్పుడునే
ప్రజా విప్లవ ప్రవాహ తాలోత్తాలపు తరంగాగ్రాన్ని
ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతపు ఘీంకారాన్ని
వెన్నెల్లో ఆడుకునే ఓ అందమైన ఆడపిల్ల ప్రతిరూపాన్ని,
అక్షరంలోని అంతరిక్షాన్ని
మనోంతఃరిక్షంలోని అక్షర నక్షత్రాన్ని
న్యాయాన్యాయ విచక్షణని విద్యాధికుల విలక్షణాన్ని
అక్షరాన్ని నేనక్షరాన్ని.

ప్రేయసి పెదవులపై ప్రణయ వేదాన్ని
తాపసి ఉచ్ఛ్వాస నిశ్వాసల ప్రణవ నాదాన్ని
కవి కలం పడేటి ప్రసవ వేదనని

భావం అంతర్వాహినిగా
అక్షర ఆలాపనల త్రివేణీ సంగమాన్ని
పక్షినై వినీలాకాశంలో చేస్తున్న ప్రదక్షిణాన్ని
అక్షుబంధిత ధర్మ దేవతకు ప్రత్యక్ష సాక్షిని
నేనక్షరాన్ని

ఇప్పుడు నే.. లక్ష కోణాలతో
క్షుద్ర సమాజపు పాప ప్రక్షాళనకై
నడుం కట్టిన వజ్ర దీక్షని

అనుమానపు అర్ధ విజ్ఞానం కాదు నే కోరేది
పునఃపరీక్షతో పరిణతి చెందే పరిపూర్ణ జ్ఞానం.
హెచ్చు తగ్గులకై ప్రతిపాదించిన
సాపేక్ష సిద్ధాంతాలు కాదు కావాల్సింది
ప్రేమ పూరిత గురుకులం పొందుపరచిన
తడిఆరని అక్షరాల ఆపేక్ష సిద్ధాంతాలు

ఆధునికత పేర వదిలేసే పద కాలుష్యాన్ని కారాదు
పది మందిని తన పరిమళంతో పరామర్శించే
పవిత్ర పుష్పాన్ని కావాలి
నే కోరేది నిరక్షర కుక్షి మస్తిష్కంలోకి నా మహా ప్రస్థానం
నే కోరేది సుషుప్తావస్థలో ఉన్న సమాజపు చైతన్యం.

నేనంటే అంతరిక్షప్రయోగం కాదు
అత్యున్నత న్యాయస్థానపు నిర్వచనం కాదు

బుగ్గైన పసి మొగ్గల జీవితాలు కాదు
నేనంటే
ఒక అద్భుతానికి ఆశ్చర్యం
ఒక విజయానికి ఆనందం
ఒక బీభత్సానికి అశ్రుతర్పణం

నా కోరిక మానవతా ఉషోదయాన్ని
తట్టిలేపే చైతన్య స్ఫూర్తిని,



లోక రక్షని కావాలని.
ఆ లక్ష్యం తీరే వరకు
ఒక అద్భుత రాగోద్భవార్థం. .
కత్తి గాటుకు గురయ్యే మురళిలా
ఆ కృష్ణుని రాకకై  విరహోత్కంఠిత రాధికనై
ఎదురు చూస్తూనే ఉంటా

బోయవాని బాణానికి బలయ్యే
పక్షులెన్ని ఉన్నా..
మరో వాల్మీకి జననం కోసం
క్రౌంచ హనన సందరోసంజనిత
శోకమే శ్లోకమయ్యే వేళ
పెంటి పక్షినై నిరీక్షిస్తూనే ఉంటా

తలవాలిన తడవ తడవకూ తలకట్టై  లేస్తునే ఉంటా
నాది చెరగని రాత నేను చెదరని గీత
నేనక్షరాన్ని

23.12.1995



## ✤ సాగిపో ✤

బాల భానుని లేత కిరణం దేహానికి వెచ్చదనాన్ని ఇచ్చి
మనసును తాకక పోతే అది వేకువ కాదు.
చీకటి పరచిన దుప్పటి మెలకువతో తొలగినంతనే
నిద్రాలోకపు విహారాలకి ముగింపు కాదు.
రోజంటే పగలూ రాత్రి కలయిక కాదు
బతుకంటే గుదిగుచ్చిన పనులూ చిట్టాపద్దులూ కారాదు.

ప్రభాతపు తొలి వీక్షణం లోంచే కలలు
వెలుగు రేకల్ని ముద్దాడాలి
రాత్రైనా, పగలైనా కలల్ని వెలిగించుకోవడం..
నింగికీ, నేలకు నడుమ మేఘంలా
గాలిలో తేలి నిప్పునీ.. నీరునీ కౌగిలించుకోవడం.
కాలంతో కరిగిపోయేవరకూ కదిలిపోవడం
జీవితమిలాగే సాగిపోవాలి.

ఏదైనా ఒక రోజు మెరుపు మెరుస్తుంది.
పిడుగులు కురుస్తాయి జీవితం తడుస్తుంది
వడగాలై దెబ్బకు విసిరేస్తుంది
ఓ అవకాశం అందలమెక్కిస్తుంది.
ఒక ఆశని లోకం జారవిడుస్తుంది.
నిన్ను ఈ ప్రపంచం ఏమారుస్తుంది

ఒక్క క్షణం నిరాశతో ఆగామా!!
నిట్టూర్పుల లోగిలిలో
నీ బతుకు నడి సంద్రపు లోతుని కొలిపిస్తుంది

ఎదురీతకు సిద్ధపడితే
విస్తరించిన సాగరాన్ని చీల్చుకుంటూ
వడివడిగా సాగే ఓడను తలపిస్తుంది.

## ✤ ఆగి..... ✤

ఆగాలి..
అప్పుడప్పుడు ఆగాల్సిందే..
గమనం ఎంత అవసరమో
విరామం అంతే అవసరం
పడిపోకుండా ఉండేందుకు ఆగాలి
నడక నడకకి నడుమ నిలబడడం
నిలబడడాల మధ్య కూర్చోవడం
కూర్చోవడాల మధ్య పడుకోవడం.. కోసం
దొంగ పరుగులు పెట్టే కొంటె వయసులో
అమ్మ ఆగమన్నప్పుడు ఆగావో లేదో
తగిలిన దెబ్బేమైనా నేర్పిందో లేదో
పెద్దయ్యాక ఆగాల్సిన సందర్భాలెన్నో
నిద్రమత్తు వదిలించుకోకుండా
పరిగెత్తాలనుకుంటే
పడతామో లేదో చెప్పుకోవాలా!
కంగారు పడ్డట్టే
పదహారు గంటల మెలకువకి
ఎనిమిది గంటల విశ్రాంతి మాత్రమే కాదు
పదానికి–పదానికి మధ్య అర్థమయ్యేందుకు
నిశ్శబ్దాన్ని పలకడం కోసం..
అప్పుడప్పుడు ఆగాల్సిందే
పనిలో నిమగ్నమైఉన్నప్పుడు పై అధికారి వచ్చాడని
కాపీని దాయలేక ఇన్విజిలేటర్ కి దొరికిపోయిన కుర్రాడిలా
తత్తరపాటు పడి నిలబడ్డామా!

మనపై, మన పనిపై తేలికభావాన్ని తెచ్చిపెట్టుకున్నట్టే
అదే క్షణంలో సగం కాలమైనా
ఆ రాకను గమనించినట్టు ఒద్దిక చూపామా
ఆగడం తనకున్న మరో అర్థాన్ని
తిరగేసి చూపిస్తుంది
అసలా ఉద్యోగమే ఏం చెప్పాలో తెలియని వేళ
మాటలాపి నవ్వినందుకే వచ్చుంటుంది
ఇంటర్వ్యూ గది ముందు అడుగాపి
గుండెలనిండా గాలిపీల్చినందుకే వరించి ఉంటుంది
సహచరితో సాన్నిహిత్యపు సమాగమం లో
ఆగాల్సిన అవసరాన్ని సూచించినప్పుడు
ఎంత కాగి ఉన్నా ఆగక తప్పదు
అశనాన్ని నివారించేందుకైనా ఆగాల్సిందే
ఆగడం మనం మర్చిపోతున్న బాల్యం
పరిగెట్టడం తెచ్చిపెట్టుకున్న లంపటం
నడవడం ఈ రెంటిమధ్య పేరుకున్న పరధ్యానం
ఆయాసమొచ్చి ఆగడం కాదు
అవసరమైనట్టూ ఆగడం ఎట్లానో గుర్తు తెచ్చుకోవాలి
ఆగడమంటే పరికించడం, పరిశీలించడం
మన ఉనికిని నిర్ధరించడం
రక్తప్రసరణని క్రమబద్ధం చేయడం
స్వవ్యవహారాన్ని నిర్వహించడం
రోడ్డున నడుస్తున్నప్పుడు
పాదచారుల సౌకర్యం కోసమే కాదు
ఊడ్చే పనివారి వెసులుబాటు కోసమైనా ఆగాల్సిందే
రోడ్డు దాటుతున్నప్పుడు
వాహనాల నుంచి రక్షణ కోసమే కావచ్చు
అవసరమైతే వారిని ఆగమని మనం ముందుకు సాగాలి
నువ్వే వాహన దారుడి వైతే సిగ్నల్ దగ్గరేనా!
మనవల్ల ఇబ్బంది కలగకూడదనుకునే ఆగాలి

లిఫ్ట్ దగ్గర ఆడవారికి దారివ్వడం కోసమో
టాయ్లెట్ల దగ్గర ఆపుచేసుకోలేనివారి కోసమో
రైలో-బస్సో ఆగినప్పుడు దిగేవారికోసమో
వయోధికుల వెసులుబాటు కోసమో
ఆగాలిబీ అందరి ప్రయాణం సాగాలి
హోపర్యవసానాలు బేరీజువెయ్యడానికో
పని మొదలెట్టేముందు
సాధ్యాసాధ్యాలు అంచనావెయ్యడానికో
చెప్పేముందు పాటించడానికో
ఇచ్చేముందో, పుచ్చుకునేముందో
ఇరువైపులా గుర్తుండేటట్టు
ఓ అత్మీయ క్షణాన్ని ఆస్వాదించడానికో ఆగాలి
జరిగేదేదైనా మంచో చెడో
బేరీజు వేసుకోవడానికైనా
ఆగకపోతే వచ్చే పర్యవసానాల్ని
చర్చించుకోకుండా ఉండాలంటే..
ఒక లెక్కగా ఆగాలి..
ఆగి..
సా..
గా..
లి..

15.7.2016



## ✤ చివరి పేజీ ✤

మనస్సాక్షి చెప్పినట్టు పేజీ చివర సంతకం చేసే
క్షణమొకటి వేచి ఉంటుంది.
పూజానంతరం నైవేద్యం సమర్పించేటందుకైనా
దాయిల్ని చల్లార్చే ఘడియొకటి ఉంటుంది

భక్తి ప్రపత్తుల గాఢత ఎంతున్నా
పూజ ముగించే పర్వమొకటి ఉంటుంది
అప్పుడు బాధ్యతల నుండి విముక్తి చెందినట్టుగా
జీవితాన్ని ప్రసాదంలా అందించే అవకాశం
తెల్లకాగితపు విస్తరిలో అక్షరాల వడ్డనతో పూర్తవుతుంది

ధ్వజానికి అవతల అంచునే జెండా రెపరెపలాడుతున్నట్టు
ఏ రచనైనా ప్రారంభం కన్నా ముగింపే బాగుంటుంది
క్రమ క్షీణోపాంత ప్రయోజన సిద్ధాంతం  వర్తించని
ఏమాటైనా మనం పంచుకునే కవితే అవుతుంది

తాడొదిలిన బొంగరంలా నా అక్షరాలు
మీ మనో ఫలకం పై రింగులు తిరుగుతాయి
ఈ పాటికే నచ్చినవి పాలపొంగై ఆలోచనాగ్నికి
స్వాహాయమానమై ఉండిఉంటాయి

అనుభవాల ఆవిరి చాలక అతకని అక్షరాలు కొన్ని
భాష్పోత్సేక మవ్వలేక నీరుగారిపోయుంటాయి.

అయినా పర్వాలేదు



అక్షరాలు అంతర్ధానమై
అంతర్యామిగా మారే అనుభూతిని కాగితాన ఇంకిన
ఒక్క ఇంకుచుక్క ఇవ్వగలిగితే చాలు
ఈ సాహిత్యం మీ ఉన్నతిని కోరే సంస్కారమని గుర్తిస్తే చాలు

ఆశ నిరాశల వెలుగునీడల్లో  చిన్నదైనా పెద్దదైనా
ఎప్పటికీ నిలచిఉండే ఓ తారలా
ఉత్సాహంతో ఒక్క మాట పునరుత్పన్నం అయితే చాలు

పేజీలు పూర్తైన తర్వాతైనా కలం నాటిన విత్తులు మొలకెత్తి
సహస్రదళాలతో వెలుగురేఖలను పొదివిపట్టితే చాలు

అక్షరాల మధ్య తెల్లకాగితం తొంగిచూసినప్పుడల్లా
నా ప్రయత్నాన్ని కొనసాగించే మరో యశస్వి
మిణుగుర్లై వెలిగి, మనల్ని;

కలల్ని ఎగిరేస్తే చాలు
జీవితాలను ఇగిర్చి ఘుమఘుమలాడిస్తే మేలు
అక్షరజ్యోతుల్ని వెలిగించిన
తెల్లకాగితానికి  మనసారా జ్యోతలు అర్పిస్తే
అదే పదివేలు

12.12.2012





వేలికొసన..
యశస్వి




# సంధ్య భానుల అమ్మ...



ఓణీ వేడుక

9.7.2017